కథ

# స్నేహితుడు

ఆనంద్‌కి అది కలో నిజమో ఇంకా అర్థం కాలేదు. ఓసారి తన చేతిని గిల్లుకున్నాడు...చురుక్కుమంది.

''హమ్మయ్య... ఐతే ఇది కలకాదన్నమాట. ఇది నిజంగా నిజం''

అలా ఒక్కసారి అనుకోగానే అతడు గాలి కొట్టిన బెలూన్లా ఉబ్బిపోయాడు. ఆనందం పట్టలేక చేతులు గాల్లోకి పైకెత్తి 'హుర్రే' అని అరిచాడు. ఒక్కోసారి నిజాలు కూడా ఎంత బాగుంటాయి.

''అసలు పత్రికలో కథలు అచ్చవడమే గొప్ప. అలాటిది తన కథకి దీపావళి కథల పోటీల్లో ఫస్ట్ ప్రయిజ్ వచ్చిందంటే అది సామాన్యమైన విషయం కాదు మరి.''

అలా అనుకున్న ఆనంద్ సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

ఈ విషయం సుధాకర్‌కి చెప్పాలి.

అసలు ఈ కథకి థీమ్ చెప్పింది వాడే కదూ!

తనిచ్చిన థీమ్‌తో కథ రాయమని భుజం తట్టి ప్రోత్సహించింది వాడు.

బలమైన కాండాన్ని అల్లుకున్న పూలతీగలాగా వాడిచ్చిన మూలం ఆధారం చేసుకుని దానిచుట్టూ తన భాషా పాండిత్యంతో చక్కని కథ అల్లాడు తను.

భాష మీద పట్టు దొరకడం కష్టం కావచ్చేమో కానీ ప్రయత్నిస్తే అసాధ్యం మటుకూ కాదు.

కానీ మూలం దొరకడమే కష్టం.

ఈ కథలో భావన వాడిది. భాష మాత్రమే తనది.

భాష కన్నా భావన ఎప్పుడూ గొప్పదే. ఐతే ఈ కథ అచ్చవడానికి, మొదటి బహుమతి రావడానికి పరోక్షంగా సుధాకరే కారణం. అందుకే మొదటగా ఈ శుభవార్త వాడికే చెప్పాలి.

ఆనంద్ హుషారుగా లేచాడు. మొహం కడుక్కుని బట్టలు మార్చుకున్నాడు.

అద్దంలో చూసుకుని తల దువ్వుకుంటుండగా హఠాత్తుగా వచ్చిందో సందేహం.

అసలు ఈ విషయం సుధాకర్‌కి చెప్పాలా ? వద్దా?

చెబితే ఈ ప్రయిజు సంగతి వినగానే మొదట తననే అభినందిస్తాడు.

కానీ ఆ తర్వాత మౌనంగా ఊరుకుంటాడా అన్నదే ప్రశ్న.

ఈ కథకి బహుమతి రావడానికి తను కూడా కారకుడే కాబట్టి ఆ వచ్చే మనీలో వాటా అడుగుతాడా?

ఒకవేళ అడిగితే తనేం చెయ్యాలి? న్యాయంగా అయితే ఆ వచ్చే డబ్బులో సగం వాడికి ఇచ్చి తీరాలి.

కానీ చూస్తూ చూస్తూ రెండు వేల రూపాయలు వాడికి ఇవ్వాలంటే ఎందుకో మనసు ఒప్పుకోవడం లేదు.

డబ్బు కన్నా న్యాయం, ధర్మం విలువైనవంటూ తను ఎన్నో కథలు రాశాడు. కానీ... తీరా తన అనుభవంలోకొచ్చేసరికి తానెందుకు ఇలా ఆలోచిస్తున్నాడు? చెప్పేటప్పుడు ఎలా ఉన్నా చేతల్లోకొచ్చేసరికి అందరూ ఒకలాగే ప్రవర్తిస్తారేమో!

ఇప్పుడేం చేయాలి?

ఆనంద్ రెండు చేతులతోటి తల పట్టుకు కూర్చున్నాడు.

ఇప్పుడతడి మనసు నాణానికి రెండోవైపు కూడా ఆలోచించడం మొదలుపెట్టింది.

కేవలం భావన ఉంటే సరిపోదు. దాన్ని అందరికీ పంచడానికి భాష కావాలి. అలాగే థీమ్ ఉంటే సరిపోదు. దానికి జిగిని బిగిని కల్పించి నలుగురి చేతా మెప్పించడానికి నేర్పు కావాలి. అందుకు భాష కావాలి.

పరిమళాన్నిబట్టే కదా మల్లె కైనా, సంపంగి కైనా గుర్తింపు!

ఓ అందమైన శిల్పాన్ని చూసిన వాడెవడైనా మొదట ఆ శిల్పి చాతుర్యాన్ని మెచ్చుకుంటాడే కానీ శిల్పంగా మారిన శిలని గూర్చి ఆలోచిస్తాడా?

అసలు సుధాకర్ ఇచ్చిన కథాంశాన్ని చక్కటి శైలితో కథలా మరల్చడానికి తనెంత కష్టపడ్డాడు! ఎన్ని రాత్రులు నిద్రల్లేకుండా గడిపాడు. ఈ ప్రయత్నంలో మూడు వంతుల కష్టం తనే పడ్డాడు. ఈ విషయం వాడూ అర్థం చేసుకోగలడు కాబట్టి ఈ వచ్చే డబ్బుల్లో తనకి వాటా ఇమ్మని అడగకపోవచ్చు.

ఇలా ఆలోచించాక ఆనంద్‌కి మనసు కాస్త తేలికపడ్డట్టు అనిపించింది.

'ఏది ఏమైనా ఇప్పుడీ విషయం వాడికి చెప్పకపోవడమే మంచిది. ఒకవేళ వాడెప్పుడైనా ఈ ప్రస్తావన తెస్తే అప్పుడు చూడవచ్చులే' అనుకున్నాడు ఆనంద్.

అందుకే సుధాకర్ దగ్గరకెళ్ళే ప్రయత్నం మానుకున్నాడు.

★ ★ ★

సుధాకర్, ఆనంద్ స్కూల్‌లో చదివే రోజుల నుంచి స్నేహితులు. కాలేజీ చదువు కూడా అయ్యేక ఇద్దరికీ ఒకే ఊళ్ళో ఉద్యోగాలు రావడంతో వారి స్నేహానికి ఏ ఆటంకమూ లేకపోయింది. సుధాకర్ తెలివైనవాడు. మంచి భావుకుడు. ప్రయత్నిస్తే మంచి రచయిత అయ్యుండేవాడు. కానీ, అతనికున్న నిర్లక్ష్యం వల్ల, కొంత బద్ధకం వల్ల ఓ మామూలు ఉద్యోగస్తుడిగానే మిగిలిపోయాడు.

కానీ ఆనంద్ మనస్తత్వం వేరు. అతడికి నలుగురిలో గుర్తింపు పొందాలనే కాంక్ష ఎక్కువ. అందులో భాగంగానే చిన్న చిన్న కథలూ, కవితలూ రాసి పత్రికలకి పంపిస్తూ ఉంటాడు. అతడికి సుధాకర్ శక్తేమిటో తెలుసు. అందుకే ఎప్పుడూ అతనితో ఏదో ఒక విషయం చర్చకు తీసుకువచ్చి సుధాకర్ ఇచ్చే పరిష్కారాల ఆధారంగా తను కథలు రాస్తూంటాడు.

★ ★ ★

కాలింగ్ బెల్ మోగిన చప్పుడవడంతో 'ఎవరొచ్చారబ్బా' అనుకుంటూ తలుపు తీశాడు ఆనంద్.

ఎదురుగా సుధాకర్‌ని చూడగానే గుండె ఝల్లుమంది. ఒకవేళ కథకి బహుమతి వచ్చిందని తెలిసి వాటా అడగడానికొచ్చాడేమో!

గిఫ్ట్‌మనీలో సగం... అంటే రెండు వేలు... అడుగుతాడా?

అడిగితే? అయ్యో... ఇప్పుడేం చెప్పాలి వీడికి?

''ఏమిట్రా అలా బిగుసుకుపోయావ్? నన్ను లోపలికి రానిస్తావా? లేదా?'' భుజం తట్టి నవ్వుతూ అన్నాడు సుధాకర్.

ఆనంద్ ఆలోచనల్లోంచి ఉలిక్కిపడి ''ఆఁ ఆఁ ఏం లేదురా... రా రా లోపలకి'' అంటూ కంగారుగా లోపలకి నడిచాడు.

ఆనంద్ వింత ప్రవర్తనకి ఓ క్షణం ఆశ్చర్యపోతూనే కుర్చీలో కూర్చున్నాడు సుధాకర్.

అన్యమనస్కంగానే తనూ ఓ కుర్చీలో కూర్చున్నాడు ఆనంద్.

''అలా డల్‌గా ఉన్నావేరా ఒంట్లో బాగా లేదా?'' ఆప్యాయంగా అడిగాడు సుధాకర్.

''ఏం లేదులే కొంచెం తలనొప్పిగా ఉంటేను..'' అనుకోకుండా అబద్ధం చెప్పేశాడు

ఆనంద్.

''ఓఁ సారీరా. నేనొచ్చి నిన్ను డిస్టర్బ్ చేసినట్టున్నాను'' నొచ్చుకున్నాడు సుధాకర్.


ఇప్పుడు సుధాకర్ రావడం ఆనంద్‌కే మాత్రం ఇష్టం లేదు. అతడి మనసంతా చిరాగ్గా ఉంది. 'ఎంత ఆదివారమైతే మాత్రం ఇంత పొద్దున్నే దిగబడాలా? తనకి మాత్రం పన్లుండవూ... ఇప్పుడు వీడితో కబుర్లు పెంచితే తప్పకుండా కథ విషయం కదుపుతాడు. సాధ్యమైనంత త్వరగా వీడిని పంపించెయ్యాలి' మనసులోనే అనుకున్నాడు ఆనంద్.

''ఇంతకీ ఏమైందిరా మన కథ? ప్రయిజు రాకపోయినా కనీసం సాధారణ ప్రచురణకైనా సెలక్టు అయిందా'' సుధాకర్ నవ్వుతూ అన్నాడు. ఆనంద్ గుండెలో బాంబు పేల్చినట్టైంది.

''ఏదీ ఇంకా నాకేఏ ఇంటిమేషనూ రాలేదు'' అప్రయత్నంగా అన్నాడు ఆనంద్.

ఎందుకో సుధాకర్ మొహంలో రంగులు మారాయి. మరుక్షణం మొహం చిన్నబుచ్చుకున్నాడు. గబుక్కున లేచి నిల్చుని ''వెడుతున్నారా'' అని అన్నాడు.

మౌనంగా గేటు దాటి వెళుతున్న సుధాకర్ని చూస్తున్న ఆనంద్‌కి ఓ క్షణంపాటు అనిపించింది 'తను తప్పుచేస్తున్నాడా?' అని.



★ ★ ★

వారం రోజులు గడిచాయి. ఆరోజే తన కథకొచ్చిన బహుమతి తాలూకు నాలుగు వేలు చేతికందాయి ఆనంద్‌కి.

''ఏవండీ నాకు పట్టుచీర కొనిపెట్టరూ'' అడిగింది భార్య సుజాత.

''ఓకే. నీకు పట్టుచీర గ్రాంట్ చేశా. మిగిలిన డబ్బుల్తో నేనూ ఓ సూట్ కొనుక్కోవాలి'' అన్నాడు ఆనంద్.

ఆరోజు సాయంత్రమే ఆనంద్, సుజాత బట్టలు కొనుక్కోవడానికి ఉత్సాహంగా బయలుదేరారు.

ఇరుకు సందుల్ని దాటుతూ, మురుగువాసన పీలుస్తూ, పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్‌లో ఏ బస్సు కిందా పడకుండా స్కూటర్‌ని చాకచక్యంగా నడిపి గమ్యస్థానం చేరాక తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు ఆనంద్.

షాపులోకి అడుగుపెడుతుండగానే ఏ దేవలోకంలోకో వచ్చి పడ్డ ఫీలింగ్. షాపులో అంతా ఏ.సి. అవడం వలన ఒళ్లంతా హాయిగా అనిపించింది.

లోపలికి రెండడుగులు వేశాడో లేదో ''ఏం కావాలి సార్? శారీనా? రెడీమేడ్ డ్రెస్సా?'' అతి వినయంగా అడిగాడు షాపు కుర్రాడు.

అలా వినయంగా మాట్లాడడం కష్టమర్లని ఆకట్టుకోవడంలో ఓ భాగమే అని తెలిసినా అదేదో తనకొక్కడికే ఇచ్చే గౌరవంగా ఫీలయి ''పట్టుచీరలు కొనాలి'' అన్నాడు ఆనంద్ కొంచెం స్టయిల్‌గా.

''ఇటు వెళ్లండి సార్'' అన్నాడు షాపు కుర్రాడు మళ్లీ వినయంగా.

సతీసమేతంగా పట్టుచీరలు సెలెక్టు చెయ్యడంలో మునిగిపోయాడు ఆనంద్.

''హలో ఆనంద్'' అంత దూరం నించే ఆనంద్‌ని చూసి అరిచినంత పనిచేశాడు సుధాకర్.

సుధాకర్‌ని చూడగానే గతుక్కుమన్నాడు ఆనంద్.

''ఏంటి చెల్లెమ్మా... పట్టుచీర కొంటున్నారా? ఏదీ చూడనీ'' అంటూ సుజాత సెలెక్ట్ చేసిన పట్టుచీర చూసి ''ఓహ్ వండర్‌ఫుల్ సెలెక్షన్'' అన్నాడు సుధాకర్.

''నేనే సెలెక్ట్ చేశా అన్నయ్యా. ఇంతకీ మీరేం కొంటున్నారు? ఒక్కరే వచ్చారే వదినగారేరీ'' అంది సుజాత.

''మీ వదిన కూడా చీర కొనుక్కుంటానంటే తీసుకొచ్చాను. శ్రావణమాసం వస్తోంది కదా.

ఆదుర్తి బాల

పట్టుచీర కొనలేనంటే సరే మామూలు చీర యినా కొనండి అడ్జష్టయిపోతానంది. అదిగో అక్కడ చీరలు చూస్తోంది. నేను మిమ్మల్ని చూసి పలకరిద్దామని ఇలా వచ్చాను'' అన్నాడు సుధాకర్.

ఆనంద్‌కి ఎవరో ఛెళ్ళున కొట్టినట్టయింది. అసలు ఈ డబ్బుల్లో వాడికి కూడా వాటా ఇచ్చేస్తే వాడు కూడా వాళ్ళావిడకి పట్టుచీర కొనేవాడేమో! ఆనంద్ మళ్లీ ఆలోచనలో పడ్డాడు.

''ఏవండీ మీరు సూట్ కొనుక్కోవాలిగా వెడదామా?'' ఆనంద్‌కి గుర్తుచేస్తున్నట్టుగా అంది సుజాత.

''ఏంటి చెల్లెమ్మా! మా వాడు సూట్ కొనుక్కుంటున్నాడా ఏంటి విశేషం'' ఆశ్చర్యంగా అన్నాడు సుధాకర్.

''ఏం లేదురా. వచ్చే నెలలో మా అక్కయ్య కూతురు పెళ్లి ఉంది. కాస్త ఖరీదైన బట్టలుంటే బాగుంటుందనీ...'' ఒక అబద్ధం కప్పిపుచ్చడానికి మళ్లీ అబద్ధం చెప్పాడు ఆనంద్.

ఒక్క క్షణం భర్త వంక తెల్లబోయి చూసింది సుజాత. 'ఈయనకసలు ఏమైంది?' అనుకుంది. మరుక్షణం ఏదో గుర్తొచ్చిన దానిలాగా సుధాకర్ వైపు తిరిగి ''ఈయన పంపిన కథకి మొదటి బహుమతి నాలుగు వేలు ఈరోజే అందాయి. తర్వాతయితే ఖర్చయిపోతాయని ఇవాళే బట్టలు కొందామని వచ్చాం'' అంది.

ఉలిక్కిపడ్డాడు ఆనంద్. 'ఈ ఆడవాళ్ల నోటిలో నువ్వు గింజైనా నానదంటారు'

''కంగ్రాట్స్ గురూ! మంచి పార్టీ అయినా ఇస్తావా?'' ఆనంద్ చేయి పట్టుకు ఊపుతూ అన్నాడు సుధాకర్.

''అయ్యో ఈ సంగతి అన్నయ్యకింతవరకూ చెప్పనే లేదా! క్రిందటి వారమే కదండి మనకి తెలిసింది''

సుజాత నోరు తెరిస్తే ఆగదు ఇంక.

ఆనంద్‌కి ఆ పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉంది. ఎందుకో సుధాకర్ ముఖంలోకి సూటిగా చూడలేకపోతున్నాడు తను.

''నీతో చెప్పాలనుకున్నా కానీ కుదరలేదురా వెరీ సారీ'' ఎటో చూస్తూ అన్నాడు ఆనంద్.

''సుజాతా... ఇంక వెడదామా'' అంటూ ''మళ్లీ కలుద్దాంరా బై'' అని గబగబా అడుగులేస్తూ వెళ్లిపోయాడు ఆనంద్.

ఏదో అర్థమైనట్టు తలపంకించి మౌనంగా నిలుచుండిపోయాడు సుధాకర్.

★ ★ ★

కొత్త సూట్ వేసుకుని అద్దంలో చూసుకుంటూ మురిసిపోతున్నాడు ఆనంద్.

'సంతోషమనేది జీవితానికి అతి ముఖ్యమైన అవసరం. సంతోషం లేని జీవితం ఎడారిలా నిస్సారంగా ఉంటుంది. అందుకే ఈ సంతోషం కోసమేగా స్నేహితుడికి అన్యాయం చేసింది తను. కానీ తనకిప్పుడు తప్పు చేసిన భావన కలగడం లేదు. ఈ నాలుగు వేలు ఇచ్చిన సంతోషంతో కాసేపు స్నేహమనే సెంటిమెంటు కొట్టుకుపోయింది. అంతగా ఐతే రేపు ఓ కిలో స్వీట్సు కొని వాడికిచ్చేసి కాసేపు కబుర్లు చెప్పి వస్తే సరిపోతుంది' అనుకున్నాడు ఆనంద్.

''ఏమండీ ఈ కవరు ఏదో మీకేననుకుంటా'' పోస్ట్‌మాన్ ఇచ్చిన కవరు ఆనంద్‌కి అందిస్తూ అన్నది సుజాత.

'తనకి ఎవరు ఉత్తరం రాశారా!' అనుకుంటూ కవరు చింపి చదవడం మొదలుపెట్టాడు ఆనంద్.

ఆనంద్‌కి,

అసలు 'స్నేహితుడు' అనే పదానికి అర్థం తెలుసా నీకు? నేనూహించిన అర్థం మాత్రం 'మిత్రుని హితవు కోరేవాడు' అని.

నా ఐడియాలతో నువ్వు కథలు రాస్తావనీ, నీకు మంచి సబ్జెక్టు దొరకడం కోసమే గంటల కొద్దీ నాతో చర్చిస్తావనీ నాకు తెలుసు. కానీ నా మిత్రునికి ఆ విధంగా ఉపయోగపడుతున్నాననే భావన నాకెంత తృప్తినిస్తుందో నీకు తెలియదు. నీకు తెలియని విషయం ఇంకొకటుంది. నీవు పంపిన కథకి మొదటి బహుమతి వచ్చినట్టు నీకు తెలిసిన రోజే నాకూ తెలుసు. ఎలా తెలుసా అని ఆశ్చర్యపోకు. మీ ఏరియా పోస్ట్‌మాన్ నాకు పాత పరిచయస్తుడే. నీకు ఇంటిమేషన్ కార్డు ఇచ్చిన రోజే అతడు నాకీ సంగతి చెప్పాడు.

నీకు గుర్తుండే ఉంటుంది. ఓ పదిహేను రోజుల క్రితం నేను మీ ఇంటికి వచ్చిన సంగతి. ఆ రోజు నేను వచ్చింది నీకు కంగ్రాట్స్ చెప్పాలని. కానీ ఈ విషయం నీ చేతే చెప్పించి అలా చెప్పడంలో నీ కళ్ళలో మెరుపులు చూడాలని ఆశించాను. కానీ నువ్వు చాలా ముభావంగా ఉన్నావు. ఒకవేళ మరచిపోయావేమోనని నేనే అడిగాను. ''నీవు పంపిన కథ ఏమైందిరా అని''. కానీ నీ జవాబు విని షాకయ్యాను. చివరికి నేను మీ గడప దాటి బయటికి వస్తున్నా మర్యాదకైనా లోపలికి రమ్మనలేదు నువ్వు. మొన్న షాపులో కూడా నన్ను చూడగానే అన్యమనస్కంగా ఉండడాన్నీ గుర్తించాను. నిదానంగా ఆలోచిస్తే మబ్బు తెరలు తొలగినట్టు నాకు నీ స్వభావం కొద్దికొద్దిగా అర్థమైంది. నీ భయానికి కారణం కూడా తెలిసింది. మన మనస్తత్వాన్ని బట్టే మనం ఎదుటివాళ్ళని అంచనా వేస్తాం. నీలో ఉన్న స్వార్థమే నువ్వు నన్ను కూడా ఓ స్వార్థపరుడిలా అంచనా వేయడానికి దోహదపడింది.

తల్లిదండ్రుల్నీ, రక్త సంబంధీకుల్నీ తనే నిర్ణయించిన దేవుడు స్నేహితుడిని ఎంచుకునే స్వేచ్ఛ మనకే ఇచ్చాడు. ఎందుకో తెలుసా? ఓ మంచి స్నేహితుడి సమక్షంలో జీవితాన్ని ఆనందమయం చేసుకోమని.

సృష్టిలో స్నేహం తీయనిది అన్నారు. కానీ కొన్ని స్నేహాలు తీయదనాన్ని ఇస్తే మరికొన్ని స్నేహాలు చేదు అనుభవాలు మిగులుస్తాయి. తప్పు స్నేహానిదికాదు. సరైన స్నేహితుడిని ఎంచుకోలేని వారిది. మనిషి ఈ లోకంలోకి వంటరిగా వస్తాడు. వంటరిగానే పోతాడు. కానీ చిత్రం ఏమిటంటే వంటరిగా బతకలేడు. మనం ఏర్పరచుకునే ఏ బంధాలలో అయినా అంతస్సూత్రం ఇదే.

స్నేహం అనేది అద్దమైతే అందులో ప్రతిబింబమే స్నేహితుడు. నువ్వు నవ్వితే నవ్వేవాడూ, ఏడిస్తే ఏడ్చేవాడూ, నీ భావాల్ని పంచుకునే వాడూ... నా దృష్టిలో స్నేహితుడికి అర్థం ఇదే.

తెలియక తప్పు చేస్తే దాన్ని 'పొరపాటు' అని సరిపెట్టుకోవచ్చు. క్షమించవచ్చు. కానీ తప్పుల్ని ఎప్పుడూ క్షమించకూడదు. ఎందుకంటే అది ఇంకొక తప్పు చేసేందుకు అవకాశమిస్తుంది.

చివరగా ఒక మాట...

జీవితంలో ఎంతో మంది పరిచయమవుతారు. కానీ పరిచయమైన ప్రతివాడూ స్నేహితుడు కాలేడు. నువ్వు నాకింక కేవలం పరిచయస్తుడివే.

శెలవు

-సుధాకర్

ఉత్తరం చదివిన ఆనంద్ స్థాణువులా నిలబడిపోయాడు.

✪

